క్లుప్తంగా

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

అనంతగిరి: సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అన్ని హిందూ దేవాలయాల్లో నిర్వహిస్తున్నట్లు హరిహర అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ కొండపల్లి వాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఏడు గంటల నుంచి ఎనిమిదిగంటల వరకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల కిందట కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో మొదటి సారి లోక కల్యాణార్థం హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని చేపట్టామని తిరిగి మరోసారి హనుమాన్‌చాలీసా పారాయణం చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు కోదాడలో టీచర్స్ ప్రీమియర్ క్రికెట్ లీగ్

కోదాడ: కోదాడ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఆదివారం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయిలో ఉపాధ్యాయులకు, వైద్యులకు ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రేస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడా పోటీల జెర్సీని కళాశాల నిర్వాహకురాలు బాణాల వసంత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, సిద్దింఖ్, చందా శ్రీనివాస్, జబ్బార్, ఖజామియా, సురేష్, అంకిరెడ్డి, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం

నడిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై శనివారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శెట్టి రజిని, మాణిక్యమ్మ, సాయమ్మ, రాజ్యలక్ష్మి, సుజాత, సునీత, నాగరాజు, విజయలక్ష్మి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ రామకృష్ణ యాదవ్‌కు కేటాయించాలి

కోదాడరూరల్ : బీజేపీ నుండి అసెంబ్లీ టికెట్‌కు దరఖాస్తు చేసుకున్న బీసీ ఉద్యమనేత పచ్చిపాల రామకృష్ణయాదవ్‌కు టికెట్‌ను కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి భాష్యం వంశీ అన్నారు. శనివారం పట్టణంలో పలు విద్యార్థి సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాలు రామకృష్ణకు బీజేపీ టికెట్ కేటాయించాని కోరుతూ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగరాజుగౌడ్, గద్దల వీరబాబు, వర్మ, సందీప్, సంజయ్, నవీన్, సువర్ణచారి, గోపియాదవ్ తదితరులు ఉన్నారు.

డీఈఓకు ఫిర్యాదు

కోదాడ : ఉపాధ్యాయ బదిలీల్లో ప్రిపరెన్షియల్ క్యాటగిరిలో చేరడానికి అక్రమంగా మెడికల్ సర్టిఫికెట్ సమర్పించిన వారిపై, వాటిని అక్రమంగా జారీ చేసిన మెడికల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన పారెల్లి వెంకటేశ్వర్లు శనివారం జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలాజీనగర్ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వీసాల కవిత మానసిక దివ్యాంగుడైన కుమారుడు తన వద్ద లేకపోయినా ఉన్నట్లు తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ పొంది ప్రిపరెన్షియల్ క్యాటగిరిలో ముందుకు వెళ్లిందని, దీంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొనట్లు ఆయన వెల్లడించారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెంలోని బేతేలు ఎవాంజికల్ చర్చి ఆవరణంలో రీచ్ అండ్ కేర్ సీఈఓ జాన్ వరుగిస్ శనివారం వితంతు మహిళలకు 17కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల స్వయంగా ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిరామారావు, ఎంపీటీసీ ఎస్‌కె మైమున్నిసాబేగం, చాంద్‌మియా, సుందరి వీరరాఘవయ్య, అంజి, సాల్మన్‌రాజు, పాస్టర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల రాస్తారోకో

చిలుకూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆంధ్రాలో అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై స్థానిక బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా హుజూర్‌నగర్‌లో టీడీపీ నాయకులు శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం వెంకటేశ్వర్లు, కె వెంకటేశ్వర్లు, కె నాగయ్య, రోషపతి, కనకరత్నం, గోపి, నాగరాజు, రాములు, వంశీ, లక్ష్మ, బాలాజీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ పండుగకు ముస్తాబు

- నేటి నుంచి మూడు రోజులు పాటు వేడుకలు



హుజూర్‌నగర్ : ఆలయంలోని ముత్యాలమ్మ విగ్రహం



జాతరకు ముస్తాబైన ముత్యాలమ్మ ఆలయం

హుజూర్‌నగర్ : కులమతాలకు అతీతంగా జరుపుకునే ముత్యాలమ్మ పండుగకు పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రతి ఏటా శ్రావణమాసంలో మూడు రోజుల పాటు ఈ జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా మూడు రోజుల పాటు జాతరను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నేడు (ఆదివారం) ఊరచెరువు గట్టున కొలువై ఉన్న పెద్ద ముత్యాలమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించనున్నారు. అదే విధంగా చీర సారెలను భక్తిశ్రద్ధలతో సమర్పించి తమ మొక్కులను తీర్చుకోనున్నారు. 11న సోమవారం మూడు గుళ్ల ముత్యాలమ్మ ఆలయంలోని చిన్న ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడులు చెల్లిస్తారు. 14న గురువారం పట్టణంలోని కనకదుర్గమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు, మొక్కులు చెల్లిస్తారు. పండుగ ఉత్సవాలలో భాగంగా రైతులు, ప్రజలు రంగురంగుల కాగితాలో అందంగా అలంకరించిన ప్రభలను తమ ఎడ్లబండ్లపై, ట్రాక్టర్లపై కట్టి మేళతాళాలతో పురవీధులలో ఊరేగించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడం ఇక్కడి ఆనవాయితీ. యాదవుల సంప్రదాయ నత్యాలు ఇక్కడ ప్రత్యేక అకర్షణ. ఈ వేడుకలకు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ వేడుకలకు మున్సిపాలిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కోదాడ డీఎస్పీ ప్రకాష్ పర్యవేక్షణలో 5గురు సీఐలు, 15మంది ఎస్ఐలు, దాదాపు 300 మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జాతర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ హరికష్ణ తెలిపారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : పేదలకు సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునగాల మండలం నారాయణగూడెం, ఆకుపాముల, సీతానగరం గ్రామాలకు చెందిన 182మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. అదే విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 41మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.15లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకొనే విధంగా ప్రభుత్వం సాయం అందిస్తుందని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీపీలు చుండూరు వెంకటేశ్వరరావు, యాతా కుల జ్యోతి, సుంకర అజయ్‌కుమార్, తొగరు రమేష్, గింజుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురానికి చెందిన షేక్.రహీం (33) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అలాగే అదే గ్రామానికి చెందిన తవనం వీరమ్మ (45) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. దీంతో శనివారం కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆ మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబాలను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.ఆయన వెంట ఆ గ్రామ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, నాయకులు వెంకటరెడ్డి ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

నేరేడుచర్ల : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ గురుకుల పాఠశాలల వసతిగృహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం ఆయన నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వీవీఆర్ స్కూల్ సముదాయంలోని అద్దె భవనంలో బాలికల బీసీ గురుకుల పాఠశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్థికంగా వెనుకవడిన కుటుంబాల పిల్లల అవస్థలు పడకుండా ఉండడానికి రాష్ట్రంలో 1600ల గురుకుల పాఠశాలలను సీఎం కేసీఆర్ ప్రారంభించారన్నారు. గతంలో కళాశాలల ఏర్పాటుకు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 12 కళాశాలలు ఉన్నాయన్నారు. త్వరతో పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో రూ.3 కోట్లతో బీసీ బాలుర గురుకుల పాఠశాలకు పక్కా భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీదర్, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ కొణతం సత్యనారాయణరెడ్డి, మత్స్యశాఖ చైర్మన్ వీరయ్య, పీఏసీఎస్ చైర్మన్లు అనంతు శ్రీను, శాఖమూరి శ్రీకాంత్, బీఆర్ఎస్ మండల పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎల్లబోయిన లింగయ్య, చిత్తలూరి సైదులు, గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ షకీనా, డీసీఓ అన్నపూర్ణ, ఎంఈఓ చత్రునాయక్, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాలు అనిత, వెంకటప్పయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

హుజూర్‌నగర్ : లోక్ అదాలత్‌లో కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులను ఉద్దేశించి వారు మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పుల మూలంగా కేసుల పాలై కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తద్వారా అమూల్యమైన కాలాన్ని వృథా చేసుకుంటున్న కక్షిదారులకు ఈ లోక్ అదాలత్ చక్కటి అవకాశమని వారు తెలిపారు. రాజీయే రాజమార్గమన్నారు. కక్షిదారులు స్నేహపూర్వక వాతావరణంలో తమ కేసులను రాజీ చేసుకుని శాంతియుత జీవనం గడపాలని వారు కోరారు. ఆస్తి పంచాయతీల మూలంగా క్రిమినల్ కేసులు నమోదు అవుతున్నాయని అది మంచి పరిణామం కాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడం ద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. ఇదిలా ఉండగా గతేడాది కాలంగా చెడు వ్యసనాలకు బానిసై తన భార్యను ఇబ్బందులు పెడుతున్న పాలకీడు మండలానికి చెందిన రూపవత్ శ్రీను లోక్‌అదాలత్‌లో జడ్జీలు కౌన్సెలింగ్ ఇవ్వడంతో తన భార్య సుజాతతో రాజీ పడి ఒక్కటయ్యారు.



హుజూర్‌నగర్ : లోక్‌అదాలత్‌లో భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న న్యాయమూర్తులు



కోదాడ : మాట్లాడుతున్న న్యాయమూర్తి

ఈ లోక్ అదాలత్ లో 2,882 క్రిమినల్ కేసులు, ఒక సివిల్ కేసు పరిష్కారమయ్యాయి. కక్షిదారులు జరిమానాల రూపంలో రూ 20,26,770 లను కోర్టుకు చెల్లించారు. అలాగే రూ 55,600లను బ్యాంకు రుణాల కింద కక్షిదారులు వివిధ బ్యాంకులకు చెల్లించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు చల్లా కష్ణయ్య, పాలేటి శ్రీనివాసరావు, జుట్టుకొండ సత్యనారాయణ, చనగాని మహేష్ న్యాయవాదులు, న్యాయ, పోలీస్ అధికారులు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

కోదాడ : కక్షిదారులకు రాజీయే రాజమార్గమని, పంతాలకు పట్టింపులు పోకుండా రాజీ పడి ప్రశాంతంగా ఉండాలని కోదాడ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్యలు కోరారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో వారు పాల్గొని పలు కేసులను పరిష్కరించారు. క్షణికావేశంతో జరిగిన చిన్న గొడవలకు కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని రాజీపడి ప్రశాంతంగా జీవించాలని వారు కోరారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమతీర్పని దీనిపై అప్పీలు కూడా లేదన్నారు. కోర్టు పరిధిలో ఉన్న 4,079 కేసులును ఈ సందర్భంగా పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, న్యాయవాదులు సాధు శరత్‌బాబు, తమ్మినేని హనుమంతరావు, ముల్కా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ నారాయణరావుకు నివాళి



హుజూర్‌నగర్ : కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు

హుజూర్‌నగర్ : ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కళాశాల ప్రధానాచార్యులు భీమార్జునరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు క్రాంతి కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్లో కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదాడ : కాళోజీ జయంతి సందర్భంగా కోదాడ ఎంఎస్ కళాశాలలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి మాట్లాడుతూ కాళోజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం తెలంగాణ ప్రజలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్ఎస్. రావు, అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, గంగాధర్, రంగారావు, వెంకటరెడ్డి, ప్రసాద్, వీరస్వామి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 60 అసెంబ్లీ సీట్లు కేటాయించాలి

హుజూర్‌నగర్ : బీసీలకు జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీలు 60 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్ల శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షులు చల్లమల్ల నరసింహ, మహిళా అధ్యక్షురాలు ఇంటి అచ్చమ్మ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే బీసీల సింహగర్జన బహిరంగ సభ పోస్టర్‌ను శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని పార్టీలు బీసీలకు కచ్చితంగా 60 సీట్లు ఇవ్వాలన్నారు. సరూర్‌నగర్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బీసీల సింహగర్జన సభలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు దాసరి వెంకన్న, బైరు విజయకష్ణ, కొమ్మగాని వెంకటేశ్వర్లు, కందాల భాస్కర్, చిన్నం వీరమల్లు, ములకలపల్లి మట్టయ్య, కంచు బ్రహ్మం, పసుల సైదులు, బాలు, శీను, సోమనాథం పాల్గొన్నారు.



సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వార్షికోత్సవానికి ఆహ్వానించలేదని ఆందోళన

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరం శ్రీ దూళ్లగుట్ట బాల ఉగ్రనారసింహస్వామి వార్షికోత్సవానికి తనకు ఆహ్వానం పంపనందుకు ఆ గ్రామానికి చెందిన నాగమణి శనివారం ఆలయం వద్ద ఆందోళకు దిగింది. స్వామివారి ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలను శని, ఆది, సోమవారాల్లో నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటిలో భాగంగా శనివారం పూజలు ప్రారంభమైన తర్వాత గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళ స్వామి వారు గుట్టపై ఉన్నట్లు తానే మొదట చెప్పానని, తాను చెప్పిన తర్వాతే స్వామి వారు వెలుగులోకి వచ్చారని అలాంటి తను ఆహ్వానం లేకుండా చేస్తారా అని ఆలయం వద్దకు ఆందోళనకు దిగింది. దీంతో ఆలయ కమిటీ నిర్వాహకులు పోలీసుల సాయంతో ఆమెను అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. తన తరపున వచ్చిన వారిపై కమిటీ నిర్వాహకులు దాడి చేశారని ఆమె ఆరోపించింది. కమిటీ నిర్వాహకులందరి తీర్మానంతోనే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నలజాల జగన్నాథం తెలిపారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి



ఇంకుడు గుంతలకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, అధికారులు

చిలుకూరు : గ్రామంలో ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సర్పంచ్ మామిడి నాగమణి చినరాములు అన్నారు. శనివారం మండలంలోని ఆర్లెగూడెంలో ఉపాధిహామీ నిధులతో ఏర్పాటు చేయనున్న ఇంకుడు గుంతలకు ఆమె శంకుస్థానన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జయమ్మనాగేశ్వరరావు, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, ఈసీ మాధవి, గిరిప్రసాద్, వీరనారాయణమ్మ, శివరాం, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కోదాడరూరల్ : ఈ నెల 18 నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు ఏపూరి రాజు మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేపెట్టాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. వర్గీకరణ చేయకపోతే మాదిగల శత్రువుగా బీజేపీ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు యలమర్తి రాము, కొత్తపల్లి అంజయ్య, ఒగ్గు ఏసోబు, లంజపల్లి శ్రీను, సత్యరాజుమాదిగ, వెంకటి, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, నరేష్, రాకేష్‌లు ఉన్నారు.

హుజూర్‌నగర్ : ప్రస్తుత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు శనివారం హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలో రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి 9ఏళ్లు అయినా వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండపల్లి ఆంజనేయులు, బచ్చలకూర ప్రసాద్, కస్తాల శ్రావణ్ కుమార్, వెంకటేశ్వర్లు, మాదాసు గోపి, బి వీరబాబు, ఎ సైదులు, మహేష్, యాకోబు, నరేందర్, లక్ష్మీనారాయణ, బద్రి, శ్రీకాంత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



కోదాడరూరల్ : మాట్లాడుతున్న రాజుమాదిగ

ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేయాలి

అనంతగిరి : మండల పరిధిలోని లకారం గ్రామంలో ఆదివారం నిర్వహించే ముత్యాలమ్మ గ్రామదేవత పండుగను విజయవంతం చేయాలని కోదాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ముత్యాలమ్మకు మాజీ చైర్‌పర్సన్ దంపతులతో పాటు ప్రమోద్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో బోనాలు సమర్పించాలని కోరారు. అనంతరం భక్తులకు, అతిథులకు కోదాడ లోని శ్రీసీతారామ ఫంక్షన్ హాల్‌లో భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

గోండ్రియాలలో..

గోండ్రియాలలో ముత్యాలమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని శ్రీఉమామహేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ గంగూరి శ్రీనివాసరావు, సర్పంచ్ నెల్లూరి లీలావతి బాబురావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలి

హుజూర్‌నగర్ : యాదవులకు గొర్రెల యూని ట్లను పంపిణీ చేయాలని యాదవ సంఘ నాయకులు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని కోరారు. శనివారం నేరేడుచర్ల మండలం బోడలదిన్నెకు చెందిన యాదవ సంఘ సభ్యులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వారం రోజుల్లో గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడికి సన్మానం

మునగాల : ప్రముఖ రంగస్థల కళాకారుడు గుంటిపల్లి పిచ్చయ్యకు కళామ్మతల్లి రంగస్థల పురస్కారం అందుకున్న సందర్భంగా మండలంలోని నర్సింహాపురంలో శనివారం పలువురు ఘనంగా సత్కరించారు. తెలుగు యూనివర్శిటీ ఎన్టీఆర్ కళావేదికలో మణికంఠ ఆర్ట్స్ థియేటర్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పిచ్చయ్యను పూలమాల శాలువాతో సత్కరించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ యాసను మాండలిక భాషను దేశవ్యాప్తంగా తీసుకెళ్లి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చి, సినీరంగంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన గొప్ప ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ పిచ్చయ్యను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన చెరువుపల్లి నాగేశ్వరరావు, అయనాల వాసు, అల్లి వెంకటేశ్వర్లు(చిన్న) షేక్ లతీఫ్ పాల్గొన్నారు..



పిచ్చయ్యను సన్మానిస్తున్న సత్యనారాయణ

‘అవినీతి, అక్రమాలకు అడ్డాగా మండల పరిషత్ కార్యాలయం’

హుజూర్‌నగర్‌రూరల్ : అవినీతి, అక్రమాలకు అడ్డాగా మండల పరిషత్ కార్యాలయం ఉందని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ శాంతకుమారి, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ అవినీతి అక్రమాలకు సంబంధించిన అన్ని సాక్షాధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. ఎంపీటీసీలతో కలిసి ఎంపీడీఓ తన అవినీతి కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయడంతో పాటు తన ఆరోపణలలో వాస్తవం లేదని అనండం విడ్డూరంగా ఉందన్నారు. మార్చి23, 2023న చేసిన తీర్మానాలకు సంబంధించిన బిల్లుల రిజిస్టర్‌పై తెల్లకాగితం అతికించి అందులో ఐదుగురు ఎంపీటీసీల సంతకాలతో తీర్మానాలు చూపించి ప్రభుత్వాన్ని మోసం చేస్తుందని ఆరోపించారు. త్వరలోనే తన దగ్గర ఉన్న సాక్షాధారాలతో జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎంపీడీఓ అవినీతి, అక్రమాలపై వివరిస్తానని ఆయన తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

హుజూర్‌నగర్ : పట్టణంలో ముత్యాలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పరిధిలో పలు వార్డులలోని డ్రెయినేజీలు శుభ్రపరిచే పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ముత్యాలమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్య లోపం లేకుండా సిబ్బంది చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపు చేయాలి

హుజూర్‌నగర్ : పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపు చేయాలని సీపీఎం నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అధిక ధరలను తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం హుజూర్‌నగర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, పి హుస్సేన్, శీలం శ్రీను, మురళి, యోన, వీరమల్లు, వీరబాబు, వీరయ్య, వెంకటి, వేణు పాల్గొన్నారు.

ఆర్టిజన్లను జేఎల్‌ఎంలుగా మార్చాలి

కోదాడ: విద్యుత్ సంస్థల్లో 20ఏళ్లుగా పని చేస్తున్న ఆర్టిజన్లను జూనియర్ లైన్‌మెన్‌లు(జేఎల్‌ఎం)లుగా మార్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కోదాడ సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12,13వ తేదీల్లో జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, భాస్కర్, బ్రహ్మం, జానీపాష, సైదిరెడ్డి, నవీన్, రాంబాబు, గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా



గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

చిలుకూరు : మండల కేంద్రంలోని 11వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ మహిళలు శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కారం కాకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.